ఏయస్వీ. రమణారావు

# పరిహారం



"....అయితే ఏమిటంటార్రా?"

"మావనీదేదో అనేసినాం కదా మీరే ఏదో మాటనాల"

"చచ్చిపోయినవాడితో పాటు మీరూ చస్తామంటార్రయితే"

"ఇప్పుడు మాత్రం మేం బతుకుతున్నాం వంటారేటండి మాఁ వెప్పుడూ శవాల్లాగే బతుకుతున్నాం."

"అన్నారు కదా; బ్రతుకుతున్న మీ బ్రతుక్కే లేదు గ్యారంటీ చచ్చినవాడి

---

**1979 చక్రపాణి రెండవ అవార్డు పొందిన కథ**

---

మీ కెం దుకురా? మీ ఏడుపేదో మీరేడవక "

"సచ్చిపోయినోడి గురించి మాఁవేడ్డం ఎప్పుడో మరిచిపోనాం బాబూ దిక్కూ మొక్కూలేని ఆడిపెల్లం గురించీ; ఆ గుంటడి గురించీ మా ఏడుపంతాను . అళ్ళు బతకాలికదా ఎలాగోనాగ నే పోతే అళ్ళమీంచి కూడా ఏ లారియో ఎళిపోతే, మరేపూసీపేసీ నేదు".

"అయితే—సింహాద్రిమీద కావాలని లారీతో లేసి చంపించీసేరంటార్రా బాబు గారు?"

"అంతమాటవేసి మాఁ బతకదఁవే? వోవేలంటేమట్టుకి మామాట సెల్లుద్దేటి బాబూ, వూరూపేరూలేని నాకొడుకులం సర్లేండి .. జరిగిపోయిందేదో జరిగి పోనాది కదా మాఁవు రెనె త్తినోరూ గొట్టుకుంటే మాత్రం సచ్చిపోయిన మా సిమ్మాద్రి బతికొస్తాదేటి? బతికున్న ఆడి పెల్లాఁవూ దాని గుంటడూ సాఁవకుండా సూడాలగావి.. ."

"చెప్పాను గదా...బాబుగారితో చెప్పి దానిక్కూడా కూలిపని ప్పిస్తాననీ ."

"కూలోడి పెల్లాఁవు కూలీ సెయ్యక పోతే కాంట్రాట్లు సేస్తుందేటిబాబూ... పది సమ్మత్సరాలు రాత్రనక పగలనక, ఎండనక వానానక పన్జేసినోడు సచ్చి పోతే .. అదీ అర్ధాంతరఁవైన సావు జస్తే, ఆడి పెల్లాఁవు బతకడానికీ దాని గుంటణ్ణి పెంచుకోడానికీ దారేదో సూపించాలి గదా .. దాని రెక్కల్లో సత్తువున్నంతకాలం కూలీ కొస్తాది.... దాని కాలికీ సేతికీ ఏటన్నా వొస్తే దిక్కేటి?"

"వొరే .వొరే పెద్ద లీడర్లలాగ ఉపన్యాసాలు దంచకండిరా మీ కూలీ బతుకులకీ బాబుగారేఁవేనా ఎగ్రిమెంటు రాసిచ్చేర్రా? మీరుకాకపోతే మరోళ్ళు.... బెదిరింపుల కెళితే అడుక్కుతింటార్రా.. నా మాట విని పన్లోకి పదండి....బాబు గారిగ్గాని తిక్కరేగిదంటే ఇంకో గేంగుని పిలిపించీగల్రు ... "

"బెదిరిస్త్రనేటండీ? పిలండి... మరో గేంగెలా గొస్తాదో మాఁవూ సూస్తాం... మాకష్టిఁవొచ్చి మాఁవు నిలబెట్టేసిన పన్ని ముట్టుకోడాని కెవుళేనా రావడానికి అళ్ళకెన్నిగుండెలుండాల? మాక్కూడా వో కట్టుంది బాబూ మీకు తెల్డుగావాల..."

"అహ! అంతగ్గూడా తెగించారన్న మాట అదే చూద్దాం . మీ తలపొగరు కట్టి కాళ్ళమీద పడిందాకా. "

"ఎవుళ్లు ఎవళ్లకాళ్లమీద పడాల నుందో ఎవులు చెప్పగల్రు బాబూ . "

"వొరే వొరే ...... తిన్నగా రాసీయంద్రా . లేపోతే "

మొహం ఎర్రచేసుకుని, గుమస్తా శంకరప్ప కోపంలో మాటలు రాక, ఊగి పోతున్న క్షణానికి సరిగ్గా ముందు —

కారు దిగిన గోవిందరాజులకి, కూలీ లన్న ఆఖరు మాట చెవినిపడి అరికాలు

మంట నెత్తికెక్కినా తమాయించుకుని, మొహంనిండా శాంతం పులుముకుని—

"శంకరప్పగారూ" అని మంద లింపుగా పిలిచేసరికి,

వెనక్కి తిరిగి, గుమస్తా, అయ్య గారిని చూపి, కొత్తగా పుంజుకున్న గొంతుతో "చూడండి చూడండి వీళ్ళ తలపొగరు " ఇంకా ఏదో అనటో తున్న శంకరప్పని వొక సంజ్ఞతో ఆపి, కూలీలవంక దయగా చూసేడు గోవింద రాజులు అంతవరకూ మోకాళ్ళమీద ముడుచుక్కూర్చున్న కూలీలందరూ లేచి పెట్టిన దండాల్నందుకుని—

"అసలే పెద్దదు దుఃఖంలో వున్న వాళ్ళని పట్టుకుని ఎందుకండీ మరింత కష్టపెడతారు " అని;

కూలీలతరపున అంతవరకూ పెద్దరికం వహించి మాట్లాడుతున్న సింహాచలం భుజంమీద చెయ్యేసి—

"పద, సింహాద్రిభార్యని చూద్దాం"

ఉదార్పుగా అంటూ ముందుకు నడిచిన గోవిందరాజులు వెనక కూలీలంతా కదిలి సింహాద్రి గుడిసెముందు ఆగేరు.

"వొారాలూ అయ్యగారొచ్చారే సూద్దాంవనీ" గుడిసె ముంజూరు ముందు మోకాళ్ళమీద వొంగి లోపలికి కేకేసాడు సింహాచలం

లోపల్నుంచి సన్నగా ఏడుపు తప్ప మనిషి రాలేదు.

ఏడేళ్ళ కుర్రాడు మాత్రం గుడిసె బయటకొచ్చి బిక్కు బిక్కుమని చూస్తూ నిలబడ్డాడు.

"సింహాద్రి కొడుకండీ" గోవింద రాజులు వేపు చూస్తూ అని;

"బైటికి రాయే వొారాలూ.. అలా గేడుస్తూ కూకుంటే పోయినోడు తిరి గొస్తాడేటే"

గుడిసెలోకి చూస్తూ అన్నాడు సింహాచలం.

"పర్వాలేదు ఇంత చిన్నవయసులో పాపం. " తెచ్చిపెట్టుకున్న సానుభూతిలో కూడా మాటలు రాక, వెనక్కి తిరిగి కారుదగ్గిర కొచ్చాడు గోవిందరాజులు.

"మరి మాంవడిగిన సంగతి. ."


కారెక్కబోతుంటే వెనకనుంచి విని పించిన మాటకి, వెనక్కి తిరిగి సింహా చలం వేపు దయగా చూసేడు గోవింద రాజులు.

"చచ్చినవాడికి నష్టపరిహారం ఇవ్వండే ఈ వెధవలు...."

గొంతు చించుకుని అరుస్తున్న శంకరప్ప మాటలకి అడ్డొచ్చి,

"శంకరప్పగారు...అనవసరమైన విషయాలలో జోక్యం కలిగించుకోవద్దని మీకు లక్షసార్లు చెప్పాను .. " కసిరి నట్టుగా గోవిందరాజు లనేసరికి,

'తిక్క కుదిరింది గుమస్తాముండా కొడుక్కి' అన్నట్టు శంకరప్పని చూసేరు కూలీలంతా.




"మీరడగాలి(ట్రా సింహాచలం(వూ. మమ్మల్ని కనిపెట్టుకున్నవాళ్ళ నొది లేస్తాం(వని ఎలా అనుకున్నా(రా మీరూ? వో అర్జెంటుపనిమీద హైద్రాబాదెళ్తున్నాను. వొచ్చీరాగానే చూస్తాని వ్యవహారం సరేనా"

అనేసి కారెక్కిపోయిన గోవిందరాజులికి రెండు చేతులూ జోడించి దండంపెడ్తూ శలవు తీసకోకుండా ఆ గుంపు అంతట్లోనూ మిగిలింది వొక్క సింహచలం(వే! మనసులో అనుమానం పీకుతున్నా—

"సరే సూద్దాం .... అయ్యగారు సెప్పారు కదా పదం(డ్రా పన్లోకి" అని పైకిఅన్న సింహాచలం మాట చెవిని పడ్డాకగాని కారు కదల్లేదు.

దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోతున్న కారు వేపు అయోమయంగా చూస్తూ నిలబడిపోయాడు శంకరప్ప!

* * *

గోవిందరాజులు వూర్లో కొచ్చి నాలుగు రోజులవుతున్నా ఏ కబురూ రాకపోవటంతో, కూలీ జనంలో సందడి మళ్ళీ మొదలయింది ఆ విషయం(వై తేల్చుకొద్దామని సింహాచలం బయలుదేరే వేళకి

"సాయంకాలంచేసి అయ్యగారు రమ్మన్నారు" అన్నాడు శంకరప్ప ప్రత్యక్షమయి.

"ఇయాల బయలుదేరి నేనే వొద్దాం(పనుకుంటున్నానండీ" అన్నాడు సింహాచలం కుదుటపడి.

"నువ్వెందుకురా?" శంకరప్ప ఆశ్చర్యంగా.

"మా వోళ్ళల్లో వాడుతప్ప మరెవరున్నారు బాబూ ఆ యిషయాలన్నీ మాటాడ్డానికి" అన్నాడు కులపెద్ద వీరయదద్ద.

"నాకవేవీ తెలియవు. సింహాద్రిగాడి

పెళ్లానొక్క_దాన్నీ రమ్మన్నారయ్యగారు" అన్నాడు శంకరప్ప.

"ఆడకూతుర్నొక్క_దాన్నీ సేసి, ఏయో కల్లబొల్లి కబుర్లు సెప్పేసి, పదో పరకో సేతలబెట్టి, సేతులు దులిపేసు కోవాలనుకుంటున్నారు కాబోలు, అయేం కుదర్వన్సెప్పీరావద్దా" అన్నాడో యువకుడు దూకుడుగా.

ఇందులో ఏదో కీలకంవుందనే తప్ప అదేవిటో మాత్రం అంతుపట్టలేక పోయిన సింహాచలం.

"నోరూవాయీ లేన్దదేటి మాటాడుద్ది బాబూ, ఎనకాలెవులో వొకలుండలగానీ" అన్నాడు సౌమ్యంగానే.

"అవన్నీ నాకు తెలీవని చెప్పాను కదరా. దానొ్కక్క_దాన్నే రమ్మన్నారు. వెనకాలో ఎవరో వొచ్చి ఏదో గొడవ చేద్దాంపనుకుంటే మాత్రం ఈ విషయం అసలు తేలేదిలేదని కూడా చెప్ప మన్నారు" అన్నాడు శంకరప్ప పట్టు వదలకుండా.

"సరే దాన్నేఎల్లనీ! ఏఁసెప్తారో అదీ సూద్దాం. అప్పుడే మనం సెయ్యాల్సిందేదో సేద్దాం" అన్నాడు వీరయవద్ద.

"అదిరాదద్దా మాటంటే" అన్నాడు శంకరప్ప

మాట్లాడకుండా శంకరప్పని చదవాలని ప్రయత్నిస్తున్న సింహాచలానికి తలాతోకా అందట్లేదు.

"ఏంరా! బెల్లంకొట్టిన రాయిలా అలా వుండిపోవడమేనా. వంపిస్తారో పంపించరో చెప్పడంవేవన్నా వుందా ఏదో వొకటి చెప్పకపోతే ముఖ్యమయిన పనులన్నీ మానుకూర్చుంటా రయ్య గారు" ఆలోచించడానికి అవకాశం యివ్వకుండా, తొందరపెట్టేస్తూ అన్నాడు శంకరప్ప.

"మొండికేసు కూకుంటే దబున్న మారాజులు మనసు మార్చుకున్నారంటే సెడిపోయేవోల్లం మనంవేరా" అన్నాడు వీరయ్యదద్ద.

"పదోపరకో సేతలబెట్టి పంపిస్తే, అప్పుడు తన్నుకు సావండి నా కొడుకుల్లారా" అనేసి చరచరా వెళ్ళిపోయాడు, ఇందాకట్లా వీరయ్యమీద విరుచుకుపడ్డ యువకుడు.

ఏం మాట్లాడ్డానికీ, ఎటు చెప్పటానికీ, పాలుపోక, దిక్కులుచూస్తూ నిలబడ్డ సింహాచలంతో –

"మరి నేనొస్తాన్నా అబ్బీ... ఇదేం కుదిరేట్టు లేదు దాన్నొక్క_దాన్నీ పంపించేందుకు వాళ్ళొప్పుకోటం లేదని, చెప్పేస్తా నయ్యగారితో .. ఆయన వస్లెందు కనవసరంగా చెడగొట్టడవూ" అనేసి, ఆఖరి అస్త్రం విడిచిపెట్టేసి, వెనుదిరిగి వెళ్ళబోయిన శంకరప్ప చెవులికి –

"ఆగండి. . నే నొస్తానని సెప్పండయ్యగోరికి."

గుడిసలోంచి ఆడగొంతుకు తియ్యగా

వినబడ్డంతో, నిలుచున్న చోటునుంచే మెడ వెనక్కి తిప్పి చూసాడు.

గుడిస ముంజూరులో నిలబడుంది వరహాలు.

సింహాచలం ఆశ్చర్యంగా చూసాడు వరహాల్ని. సిమ్మాద్రి పోయింతర్వాత గుమ్మంలోకి వరహాలు రావడం ఇదే మొదటిసారి మరి!

"ఎవ్వారం సాగదియ్యక ఎల్లనీరా, ఏటవుద్దోం సూద్దాం" అన్నాడు వీరయ్య సింహాచలం కెదురెళ్ళి.

"సరె వొస్తాదని సెప్పండి" అన్నాడు సింహాచలం నిర్లిప్తంగా.

"మంచిది"

వరహాల్ని కళ్ళప్పగించి చూస్తూ, అవి, కదిలాడు శంకరప్ప

ఎవరిదార్న వారు వెళిపోతున్నవాళ్ళ వేపు చూస్తూ నిలబడిపోయింది వరహాలు.

* * *

శీతాకాలపు సాయంకాలపు ఎండ ఆ ఇంటి ఎత్తరుగు మెట్లమీంచి గెంతుకుంటూ వొచ్చి చివరి మెట్లమీద నిన్నవేళ -

కచ్చి మొక్కకి పూసిన అందమైన పువ్వులా పచ్చగా మెరిసిపోతూ, పట్టుమని పాతికేళ్ళయినా లేని వరహాలు ఆ ఎత్తరుగు చివరిమెట్టుముందు నుంచొని విశాలమయిన ఆ ఇంటినంతా చూసి, వెనక్కి తిరిగి చాలా దూరంలో లీలగా కనపడుతున్న సింహాచలాన్ని చూసి — వొక్క క్షణం ఆలోచించి —

మెట్లెక్కుతున్నప్పుడు —

పల్చటి ఆమె పాదాల పచ్చదనపు కాంతి -

అంతవరకు మెట్లమీంది జారొచ్చిన బంగారపు ఎండ మళ్ళీ మెట్లెక్కుతున్నట్టుంది!

ముందు హాలులో నేలడస్కముందు సూర్చుని లెక్కలు చూసుకుంటున్న శంకరప్ప, మెత్తటి పాదాల చప్పుడుకి తలెత్తకుండానే, ముక్కుమీంచి జారిన కళ్ళద్దాల సందుల్లోంచి కళ్ళెత్తి, వరహాలు రావటం చూసి, వెనకాల ఎవరేనా వొచ్చారేమోనన్న ఆలోచన రాగానే, మెడ బాగా రిక్కించి చూసి, ఎవరూ రాలేదని రూఢిపరుచుకున్నాక—

"వుండు, అయ్యగారితో చెప్పొస్తాను" అని లేచి లోపలికెళ్ళి, రెణ్ణిముషాల్లో తిరిగొచ్చి

"పద" అని లోపలకు తీసుకెళ్ళి, అక్కణ్నుంచున్న మేడమెట్లు ఎక్కి, వో గదిముందు నిల్చొని,

"బాబూ, వరహాలొచ్చింది" అన్నాడు.

ఆ మాటకోసమే ఎదురు చూస్తున్నట్టుగా, ఆ గది తలుపులు తెరుచుకున్నాయి! గోవిందరాజులు బయటకొచ్చి, శంకరప్ప వెనకాల ముగ్ధమోహనంగా నిలబడ్డ వరహాల్ని చూసాడు.

"శంకరప్పగారూ, మీ రివాల్వర్‌కి పని కట్టేసి ఇంటికెళ్ళొచ్చు" అన్నాడు.

"చిత్తం"

శంకరప్ప వెళ్ళిపోయాడు.

గోవిందరాజులు లోపలకెళ్ళి, సిగరెట్టు టిన్నూ, లైటరూ తెచ్చుకుని, ఊగుడు కుర్చీలో కూర్చుంటూ—

"కూర్చో" అన్నాడు సిగరెట్టు ముట్టించుకోడానికి లైటరు వెలిగిస్తూ.

శీతాకాలపు గాలి రివ్వున వీచింది.

లైటరు చివర్న అల్లల్లాడిన నీలి మంటలా, వరహాలు గుండెల్లో ఆశ రెప రెపలాడింది!

ఆ విసురుకి చెదిరిపోతున్న పైటని సవరించుకుంటూ, పిట్టగోడ నానుకుని మోకాళ్ళమీద కూర్చుని, పైట భుజాల చుట్టూ కప్పుకుంది.

పైట బిగించి కప్పుకోవటం మూలాన మరింత పొంగుకొచ్చిన ఆమె పచ్చటి గుండెల ఎత్తులమీద సాయంకాలపు ఎండ పరుచుకోవటంతో, ఆ అందాలన్నీ వొంచుకున్న ఆమె అందమైన మొహం మీద ముచ్చటగా ప్రతిఫలిస్తోంది! వాల్చుకున్న ఆ విశాలమైన కను రెప్పల క్రింద దాగున్న అందమైన కళ్ళల్లో మెరుపులు పచ్చటి ఆమె బుగ్గలమీంచి జారి ఆమె పెదవుల్లో ఎర్రగా ఇంకి పోతున్నాయి!

ఆమె బ్రతుకును భయంకరంగా చుట్టుముట్టిన చీకటిముద్దలా, వొత్తయిన ఆమె జుట్టుముడి భుజాల పొంగులమీంచి బరువుగా జారిపడుతోంది!

ప్రపంచంలో వున్న అందమంతా తన కళ్ళముందు కుప్పపోసి వుండడంతో గోవిందరాజుల గుండెలు ఉద్వేగంతో తడబడుతుండటంతో, కొన్ని క్షణాలు నోటంట మాటరాలేదు!

"నీ పేరేంటన్నావూ?" ఎలా ప్రారంభించాలో తెలియక మొదలెట్టాడు.

"వరహాలమ్మ" అంది తలొంచుకునే.

"నీకో పిల్లాడున్నట్టున్నాడు కదూ? తీసుకురాలేదా వాణ్ణి?"

తీసుకురాలేదన్నట్టు తల వూపింది.

"ఇంత చిన్న వయసులో నీకు చాలా కష్టం వొచ్చింది పాపం" అన్నాడు గొంతులోకి కొంత దయతెచ్చుకొని.

ఆమె ఏం మాట్లాడలేదు.

'అంత దయగల మాటన్నందుకేనా ఆ అందమైన కళ్ళెత్తి వొకసారి చూస్తే ఏంపోయిందీ' అనుకున్నాడు గోవింద రాజులు.

"సింహాద్రి పోయాక, నేనే కబురు పెడ్దామనుకున్నాను. పనులవల్ల కుదిరింది కాదు. ఇంతలోకే మీ వాళ్ళు నానా హడా వుడీ చేసారు" ఆగి ఆమెలోకి చూసేడు.

ఆమె తలొంచుకునే వింటోంది.

"నీ వెనక నీ పుట్టింటివాళ్ళెవరూ లేరా?"

లేరన్నట్టు తలూపింది.

"నీ మొగుడి తరపువాళ్ళో?"



లేరనే తలూపింది

"అయితే నీ వెనకున్న వాళ్ళంతా ఆ కూలీజనంవే నన్నమాట"

ఈ సారేం చెయ్యలేదు.

"సరే సింహాద్రి చనిపోయినందుగ్గాను వాళ్ళు తర్కించి అడుగుతున్న నష్టపరిహారంకింద గాదుగానీ, నీ ఈ స్థితి చూసి జాలితో నేనిచ్చే డబ్బుతో ఏం చేద్దావనీ?" అసలు విషయంలోకి వస్తూ అదిగాడు.

"నా కొడుకుని చదివించుకుని పెద్దవాడిని చెయ్యాలని"

మొట్టమొదటి సారిగా మాట్లాడిన ఆమె గొంతులో తియ్యదనం కన్నా హెచ్చుగా వున్న తీవ్రతనీ, అందులో వున్న స్థిరనిశ్చయాన్నీ చూసి గోవిందరాజులు ఆశ్చర్యపోయాడు.

అంత అట్టడుగు వర్గంలో ఆడగొంత నుంచి ఇంత వున్నతమైన మాట వొస్తుందని అతని ఊహకందని విషయం

ఆమాట వెనుక ఆమె కున్న సంస్కారం ఎటువంటిదో అతని అంచనా కందనిది; అంత స్వచ్ఛమైన ఆశయంతో తన ముందుకు వొంటరిగా ధైర్యంతో వొచ్చిన ఆమె గురించి వేరే విధంగా వున్న తన ఆలోచన అసాధ్య మవుతుందేమోనన్న వో విధమైన అనుమానమూ, పెరోవిధమైన జంకూ, కలక్కపోలేదతనికి।

కాని ఆమెపట్ల అతని వ్యామోహం రవ్వంత సడల్లేదు।

కారణం?

ఆమె నిస్సహాయస్థితి।

ఆమెకున్న వాకేవాత ఉన్నతమైన ఆలోచనని ఆమె బలహీనత కింద జమ కట్టుకున్నాడు తను।

ఎదుటి మనిషి బలహీనత తెలిసిపోయి నప్పుడు, లొంగదీసుకోడ మన్నంత సులువైన పని ప్రపంచంలో మరోటి లేదు।

అందుకే తన ఆలోచనని దారి మళ్ళించాడు।

"నీకలాంటి ఆలోచన వున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది వరహాలూ కొన్ని పనులు సాగడానికేమాత్రం ఆస్కారం లేని ఈ కూలివాడలో" క్షణం ఆగి, ఆమె ఏమంటుందోనని చూసాడు.

ఆమె ఏం మాట్లాడకపోవటంతో, "పోనీ, నీకిష్టమైతే నేనో ఏర్పాటు చేస్తాను." అని మళ్ళీ ఆగేడు.

ఆమె చటుక్కున కళ్లెత్తి అతని వేపు చూసింది।

అంత చక్కని కన్నుల్లో వో అందమైన మెరుపు అతని గుండెల్లోకి దూసుకొచ్చింది.

ఆ తాకిడికి తట్టుకోలేక సిగరెట్టు వెలిగించుకునే మిషలోకి వెళ్ళాడు కొన్ని క్షణాలు.

"నాకు తెలిసిన చిన్నపిల్లల హాస్టల్ ఒకటుంది. అందులో నీకు పని ఇప్పించగలన్నేను. నువ్వక్కడ వుండే ఏర్పాటు కూడా చేస్తాను దానికి దగ్గర్లో వున్న స్కూల్లో నీ పిల్లాడిని చేర్పించేలా చూస్తాను. ఇంతకీ వాణ్ణింతవరకూ ఏ బళ్ళోనన్నా వేసారా?" అని, ఆగేడు.

"మూడో క్లాసు చదువుతున్నాడు." అంది వరహాలు ఆరాధనాపూర్వకంగా అతనో చూపు చూసి.

"ఇహనేం నీ కిష్టమైతే నేను చెప్పినట్లు చెయ్యి. నేను అప్పటప్పటొచ్చి మంచీ చెడ్డా చూస్తుంటాను. ఎందుకో నిన్ను చూడగానే, నీ మనసు లోని ఆలోచన వినగానే, నీ కిలాంటి సహాయమేదైనా చెయ్యాలనిపించి." తన మాటల ప్రభావం ఆమెమీద ఎంత వరకూ పనిచేస్తుందో చూడ్డానికి, మళ్ళీ ఆగేడు

ఆమె తలొంచుకునే వుండడంతో,

ఏదీ మాట్లాడకపోడంతో, ఆ విషయంపై ఆలోచిస్తోందనుకుని,

"తొందరలేదు. బాగా ఆలోచించుకో. అక్కడ్లే దనుకుంటే మానెయి. బలవంతం లేదు. మీ వాళ్ళడుగుతున్న నష్టపరిహారం కూడా ఎంతో కొంత ఇవ్వకపోను. అది వెనక కాపుగా ఏ బేంకులోనో వేసుకుందుగాని" అంటూ లేచాడు.

వరహాలుకూడా చట్టున లేచినుంచుంది.

"ఏదో విషయం రేపటికి చెప్పు. వెళ్ళరా. నేనొకవేళ లేకపోయినా, మా శంకరప్పగారితో చెప్పు నీ ఉద్దేశం—"

"వొస్తాను బాబూ" అంది వరహాలు చేతులు జోడించి।

తలొంచుకుని, ఆలోచించుకుంటూ, మెట్లు దిగి వెళుతున్న, వరహాలు వెనక భాగపు అందాల్ని కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయాడు గోవిందరాజులు.

* * *

"—ఎగ్గొట్టేదానికలాగే మాట్లాడ్తారే పెద్దోలంతాను .. పొక్కత్తినే ఎప్పు డయితే రమ్మన్నాడో, ఇలాటి దేదో జరుగుతాదన్నేనప్పుడే అనుకున్నాను."

చెప్పిందంతా విని, అన్నాడు సింహా చలం.

వరహాలేం మాట్లాడలేదు.

"నీ వుద్దేశ(వేటయితే ఇంతకీ?" అడిగాడు వీరయ్య.

ఆ మాటతో వాళ్ళ ఉద్దేశం బోధ పడిపోయింది వరహాలుకి.

"నా పిల్లాడు నాలుగక్షరమ్ముక్కలు చదువుకుంటే చాలు, నా బ్రతుకెలాగ వెళ్ళిపోయినా" అంది

"ఇన్ని మాటలెందుకు వీరయదద్దా. ఆ బాబు చెప్పినట్టే సెయ్యదల్చు కుందది.

"మరి మన మాటేటి సెవికెక్కద్దీ" అన్నాడు విసురుగా సింహాచలం.

"అంతేనేటమ్మాయితే" సందేహం విడక, అడిగాడు వీరయ్య.

వరహాలు మాటాళ్లేదు।

ఆమె నిశ్చయం అర్థ(మైపోయిన కూలీజనం ఆశ్చర్యపోయారు.

"ఆ తర్వాతొచ్చి అలగ జరిగింది ఇలగ జరిగింది అని నెత్తీ నోరూ కొట్టు కుంటే మా(వేటీ సెయ్యలేం" అన్నాడు ఆఖరి మాటగా సింహాచలం.

"నా కర్మ( వెలాగుంటే అలాగ జరుగుతుందన్నా."

అన్న వరహాలు మాటవిని అక్కడ చేరిన వాళ్ళొక్కొక్కళ్లూ కదిలిపోసాగేరు

"అలగెందు కనుకుంటవు తల్లీ. నువ్వూ నీ పిల్లడూ ఎక్కడో దగ్గిర పేమం గుంటె అదే సాలు మాకు. ఏ దిక్కూ లేనోళ్లకి బగవంతుడే దిక్కు, అడిదే భార(వంతాను" అన్నాడు వీరయ్య కూడా లేస్తూ.

వరహాలు కళ్ళు నీళ్ళతో నిండు కున్నాయి।

ఇదింతా అర్ధంకాక బిక్కమోహం వేసుకుని విలిబిద్ద కొడుకుని దగ్గిరకు తీసుకుని గుండెల్లో పొదువుకుందామె.

* * *

తన నిర్ణయం వరహాలు చెప్పిన మూడోనాటికల్లా తను చెప్పిన ఏర్పాటుచేసి కబురంపించాడు గోవిందరాజులు। వున్న మూటాముల్లే సర్దుకుని పేరుపేరునా చెప్పి ఆ వాడ వొదిలి పిల్లడ్ని తీసుకు నొచ్చేసింది వరహాలు.

తన కొడుకంతవాళ్లూ, అంతకన్నా కొంచెం పెద్దవాళ్లూ, దాదాపు వో వంద మంది పిల్లలుంటున్న హాస్టలది. వరహాలు చెయ్యవలసిన పనల్లా మెస్‌లో వంట వాడికి పైపనిచేస్తూ సాయంచెయ్యటంవూ, అప్పటప్పట పిల్లలకు కావల్సిన చిన్న చిన్న పనులు చేస్తూండటంవూను.

తనకీ, తన పిల్లాడికి రెండుపూటలా భోజనం.

దగ్గిరున్న వీధిబడిలో తన పిల్లాడి చదువు.

వాతావరణం కొత్త। మనుషులు కొత్త। అందువల్ల కొద్దిరోజులు ఇబ్బంది పడ్డా, కొంత సర్దుకున్నాక, వరహాలుకి తన జీవితం సాఫీగా నడుస్తున్నట్లని పించింది।

ఆ హాస్టల్లోనే పజ్జేస్తున్న వయసులో వున్న మగాళ్లు తన అందాన్నీ, వయసునీ కళ్ళప్పగించి చూస్తూ వుండిపోవటం అప్పటప్పట కొంచం ఇబ్బంది కలిగిస్తున్నా, వయసు మీరి, పెద్దవాడయిన వంటాయన మంచితనంవల్ల కొంత రక్షణా, ఆ హాస్టలు నిర్వహణాధికారుల్లో ముఖ్యుడయిన గోవిందరాజులు స్వయంగా వేయించటంవలన మరికొంత రక్షణా లభించటంతో, అదో పెద్ద సమస్యగా తోచలేదు వరహాలుకి।


వాడబడిలోంచి వీధిబడిలో చేరటంతో చదువుమీద గురికుదిరి, శ్రద్ధగా చదువు కుంటున్న కొడుకుని చూసి తృప్తితో, జీవితాన్ని ఎదుర్కోడానికి కావలసిన మనోధైర్యం ఏర్పడుతోంది వరహాలుకి.

అయితే—

కొడుకువల్ల వో కొత్త యిబ్బందెదు రవుతోంది। కొత్త ప్రపంచంలో కొచ్చి రకరకాల మనుష్యుల్ని, వాళ్ళ వింత మాటల్ని, విచిత్ర వేషాల్ని చూడ్డంతో వాడికి అప్పటికే కొద్దిగా వొచ్చిఉన్న ఊహ పెరగసాగడంతో, ప్రతివిషయాన్నీ ఆరాతీస్తున్నాడు. తల్లికి అర్థంకాని, సమాధానం చెప్పలేని ప్రశ్నలేస్తున్నాడు. రోజురోజుకీ వాడెదిగిపోతున్నాడు।

అంతకన్నా చిత్రమైన సమస్య ఏవిటంటే—

నిశ్చింతవల్ల మనసుకు వొకరకమైన స్థైర్యం ఏర్పడ్డంతో, సరయిన తిండి వలన అవయవాలకి పుష్టీ, నీడపట్టు వల్ల శరీరానికి రంగూ, వయసువల్ల




వొంపులకి విగారింపులూ, కలిగి చూసే ప్రతి మగకంటినీ చెదరగొడుతోంది ఆమె అందం।

గోవిందరాజు లొచ్చినప్పుడల్లా అతని చూపులన్నీ ఆమె వొంపుల పైనే। మాటల్లో లేని కోర్కె చేష్టల్లో।

వొంటరితనం, నిశ్శబ్దపు వెన్నెల రాత్రుళ్ళు.. గతంలోని అనుభవాలు, వొంట్లో రక్తాన్ని మరిగించినప్పుడు—

అనుకోకుండా ఆమె కళ్ళముందు గోవిందరాజులు।

మనసులో ఏవో తెలీని రెండు శక్తుల మధ్య యుద్ధం।

పైగా—

గోవిందరాజులు వొచ్చినప్పుడల్లా — కొడుకు తామిద్దర్నీ చూసే అదో రకమైన చూపు—

అతను వెళ్ళిపోయిన్తర్వాత చాలా సేపటివరకూ వాడి మౌనం —

ఇదంతా చూస్తుంటే వరహాలుకి గుండెల్లో అలజడి।

ఊహించనిదేదో జరగబోతోందన్న భయం।

ఆ క్షణం కూడా ఆమె ఊహించకుండానే వస్తుందని ఆమె కించిత్తయినా ఊహించనంతలో ముంచుకొచ్చింది।

ఆ రోజు—

అర్థరాత్రి మెలకువగా ఆలోచిస్తూ నిద్రపోతున్న అమాయకమైన కొడుకు మొహంలోకి చూస్తూ పడుకున్న క్షణంలో—తలుపు చప్పుడు।

తియ్యగానే లోపలికొచ్చిన గోవిందరాజులు।

ఊహించకుండా ఉక్కిరిబిక్కిరి చేసిన ఉక్కు కౌగిలి।

వద్దనుకుంటున్నా వినకుండా ఎగిరిపడే కోరిక కెరటం।

విరిగిపడి గుండెల్లో కలిగించిన అలజడి!

తనకు తెలీకుండా లొంగిపోయిన నరాల బలహీనత!

చాలాకాలం తర్వాత వొళ్ళంతా ఆక్రమించిన మత్తు!

సంతోషంవో, దుఃఖంవో, తీపో, చేదో ఏదో నిర్వచించలేని వొకానొక అనుభూతికి లోనయిన ఆమె దానివల్ల కలగబోయే పరిణామాల్ని కూడా ఊహించ వ్యవధిలేని ప్రవాహంలో కొట్టుకుపోయింది!

ఆ మత్తులోంచి తేరుకోలేక మగతగా పడుకున్న గోవిందరాజుల్ని — ఏం జరిగిందో తెలియక, కనీసంఊహించలేక, అమాయకంగా పడుకున్న కొడుకునీ—

చూస్తూ, నిర్లిప్తంగా వుండిపోయింది వరహాలు!

కాస్సేపటికి తేరుకుని, లేచిన గోవిందరాజులు, ఆమెని చూసి —

"నిన్ను అన్యాయం చెయ్యను వరహాలు ఈ వ్యవహారానికి నువ్వొప్పుకుంటే దీనికి శాశ్వతమైన ఏర్పాటు చేస్తాను." అన్నాడు.

అవునని కాని, కాదని కాని అనడానికి వరహాలు గొంతు ఆమె స్వాధీనంలో లేదు!

"రేపొస్తాను" అంటూ వెళ్ళిపోయిన గోవిందరాజులుతో

'రావద్దని' కూడా చెప్పలేకపోయింది తెల్లారింతర్వాత, తల్లిలో వచ్చిన ఏదో తెలియని మార్పు అర్థంకాక చూస్తున్న కొడుకు మొహంలోకి సూటిగా చూడలేకపోయింది వరహాలు!

* * *

ఎంత గుట్టుగా దాచాలని ప్రయత్నించినా దాగలేదు ఈ వ్యవహారం! హాస్టల్లో బయలుదేరిన గుసగుసలు వూళ్ళోకి ప్రాకి కూలివాడదాకా చేరాయి. గోవిందరాజులు వ్యామోహానికి ఎంత అంతు లేదంటే, దేన్నీ లెక్క చెయ్యడం మానేసాడు వరహాలు ముందు! సింహాచలంవూ, వీరయ్యదద్దా, విడివిడి గానూ, కలిసీ, మరికొంతమందినీ వెంటబెట్టుకొచ్చి ఎంతగానో చెప్పి చూసారు

ఎవరేం చెప్పనా ఆమె ఏం మాట్లాడక పోవడంతో విసుగేసి వొదిలేసారు గానీ—

అక్కడా, ఇక్కడా వినీ, ప్రత్యక్షంగా చూసీ, రోజురోజుకీ తనపట్ల మౌనంగా అసహ్యాన్ని పెంచుకుంటున్న తన కొడుకుని చూసి—

అప్పటప్పట తనవేపు అతి నీచమైన భావంతో వాడు చూసే చూపు చూసి— ఆమె విపరీతంగా వొణికిపోతోంది!

వాడి చిన్నిమనసులో రోజురోజుకీ దట్టంగా కమ్ముకుంటున్న మబ్బుల్లోంచి ఎప్పుడు మెరుపు మెరిసి ఆ వెంటనే పడబోయే పిడుగు ఏక్షణంలోపడుతుందో నని ఆమె భయపడని క్షణంలేదు!

అయినా—



ఆమె గోవిందరాజుల్నొదల్లేక పోతోంది.

అసలు ఆమె కలలో కూడా ఊహించని విషయం ఏవిటంటే—

గోవిందరాజులు ఆమె నొదిలేస్తాడని.

ఏ విషయం చెబితే తమ అనుబంధం శాశ్వతమవుతుందని ఆమె అమాయకంగా అశించి, కొండంత ఊహతో చెప్పిందో-

ఆ విషయం ఆమెనోట విన్న మరుక్షణం నుంచీ—

గోవిందరాజులు ఆమెకంట పడలేదు

కాళ్ళీడ్చుకుంటూ బంగళా కెళ్ళినా రవ్వంత దయచూపించలేదు సరికదా - దర్శనమేనా యివ్వలేదు.

రోజురోజుకీ పెరుగుతున్న ఆమె కడుపుతో పాటు-

కొడుకు గుండెల్లో తనపట్ల ద్వేషం అంతకు మించి పెదుగుతోందని - వాడి చూపులు చూస్తే ఆమెకు స్పష్ట మవుతోంది.

"బాబూ వారే నాయనా. తండ్రీ రాంవుడూ" ఎంత దీనంగా పిలిచినా వాడు పలకడు.

'అమ్మా'ని వాడి నోటంట విని కొన్ని యుగాలయినట్లుందామెకి! ప్రవర్తనా రాహిత్యపు నేరంమీద హాస్టల్లోంచి అమెని తొలగించినప్పుడు కూడా గోవిందరాజులు కలగజేసుకోలేదు!

కడుపు చేత్తో మోసుకుని కూలివాడ కెళితే వొక్కరూ కన్నెత్తి చూళ్ళేదు, పన్నెత్తి పలకరించలేదు!

ప్రతి విషయం ప్రత్యక్షంగా చూసిన హాస్టలు వంటాయన చేరదీసి ఆదరించాడు గానీ—

కన్నకొడుకు ఆదరంగా 'అమ్మా నేనున్నాన'ని అన్లేదు!

వరహాలుకి క్షణక్షణం గుండెల్లో కమ్ముకుంటున్న కొండంత భయం అదే! వొక్కో క్షణంలో వాడి చూపులో వాడు కాదు కనిపిస్తోందామెకి – సింహాద్రి!

నెలలు నిండి కడుపులో ప్రాణం పెరుగుతున్నకొద్దీ —

రావుడు తల్లికి చాలా దూరమయిపోయాడు!

ఇంట్లో వుండటం మానేసాడు వాడు. వొస్తే అన్నాని కొచ్చేవాడు లేకపోతే అదీ లేదు. తోటిపిల్లలు తనవేపు చూసే చూపులు భరించలేక బడి కెళ్ళటం మానేసాడు. హాస్టలు తోటలో ఏ చెట్టు కిందో మోకాళ్ళమీద తలపెట్టుకుని ఏదో ఆలోచన. ఎడతెగని ఆలోచన కడుపు మోసుకుని తనకోసం 'రావుడూ.. నాయనా'ని వెదుక్కుంటూ తల్లి పిలిచే పిలుపు వాడి నేమాత్రం కదిలించేది కాదు. వంటాయనొచ్చి ఎంతసేపో బ్రతిమాలితే గాని లేచెళ్ళేవాడు గాదు. వెళ్ళినా తల్లి ఎదురుగా కూర్చుంటే తినే నాలుగు మెతుకులయినా తినేవాడు కాదు! రోజు రోజుకీ దూరమయిపోతున్న కొడుకుని చూసి మానసికంగా కృంగిపోయింది వరహాలు!

పాపం పెరిగిపోతున్నట్టు పెరిగిపోతున్న తన కడుపును చూస్తే తనకే రోత పుట్టేది బాధ భరించలేక తన చేతుల్తో తనే తన కడుపుని పిసుక్కోవాలనిపించేది. కాని చెయ్యలేక పోయేది. కృంగి కృశించి చిక్కి శల్యమైపోయింది. వొకప్పటి వరహాలుకీ ఇప్పటి వరహాలుకీ ఏంతో తేడా! నెలలు పూర్తిగా నిండిపోవటంతో మంచం దిగలేకపోయింది! గొంతుకు అప్పుకుపోయినప్పుడు 'రావుడూ, తండ్రీ మంచి నీళ్ళివ్వరా బాబూ' అని అరిచేది! వీధి గుమ్మంలో కూర్చున్న రావుడికి విని పించినా లేచెళ్ళేవాడు గాదు! ఎంత పాపపు బ్రతుకయిపోయిందిరా నాది' అని నెత్తిబాదుకు నేడ్చేది. అయినా చలించేవాడు కాదు రావుడు. అంత చిన్న వయసులో వాడికి అర్థమయిం దొతా? అర్థమయిందాంట్లో అసహ్యమెంతయిం దొతా? వాడి చిన్న గుండెల్లోవున్న కోపమెంతా? అని వంటాయన ఎంత ఆలోచించినా అంతుబట్టేది కాదాయనకి!

ఆయన మాత్రం శెలవుపెట్టేసి వరహాలు దగ్గిరే కూర్చున్నాడు ఏ క్షణంలో ఏం అవసరం వొస్తుందోనని।

ఆ క్షణం రానే వొచ్చింది వో తెల్లవారు ఝామున —

ఎవరి అవసరం లేకుండానే—

మగపిల్లాడ్ని కన్నాది।

ఆ క్షణంలో—

హోరున వర్షం కురుస్తున్నా, చలి ఎముకలు కొరికేస్తున్నా — హాస్టలు వరండాలో ముడుచుకు పడుకున్నాడు రావుడు। రాత్రల్లా తల్లి నొప్పుల బాధ భరించలేని స్థితిలో కొడుకుకోసం కలవరిస్తున్న ఆమె పరిస్థితి చూడలేక, అంత వర్షంలోనూ తడుసుకుంటూ వంటాయన రెండుసార్లు వొచ్చి పిలిచినా వెళ్ళలేదు వాడు। శాంతంగా వుండే ఆయనకు కూడా వాడి ప్రవర్తన చూసి ఎంతో కోపంవొచ్చి కేకలేసినా వాడు నిర్లిప్తంగా వుండిపోయాడే తప్ప కదల్లేదు।

పురుడొచ్చిన పావుగంట వరకూ స్మృతి తప్పిపోయిన వరహాలుకి తెలివొచ్చిన మరుక్షణంలో వాతం చుట్టుముట్టేసి, మాట్లాడే-దుకూడా గొంతు పెగలక మంచం చుట్టూరా కళ్ళతోనే కొడుకోసం వెతుకుని, కనపడక పోవటంతో వంటాయనవేపు అర్థింపుగా చూసింది।

ఆయనకి పరిస్థితి చెయ్యిదాటిపోయిందని అర్థమయిపోయింది। పరుగెత్తుకుంటూ వెళ్ళి పడుకున్న రావుడిని కుదిపి లేపి—

"మీ అమ్మ ఇంకెంతసేపో బ్రతకదు నాయనా. ఆఖరి క్షణాల్లో కూడా నిన్నే వెదుకుతోందిరా. పద బాబూ" అని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు

ముసిలాయన కళ్ళల్లో నీళ్ళు చూసి కదిలాడు వాడు।

"వరాలమ్మా రావుడొచ్చాడు చూడు తల్లీ .." అన్న మాటలు విని కళ్ళు తెరిచి చూసింది వరహాలు

ముట్టుకుంటే మైలపడిపోతానన్నంత దూరంలో - అప్పుడే పుట్టిన చిన్నవాడి వేపు చూస్తూ నిలబడిన కొడుకుని చూసి

'తమ్ముడురా, తండ్రీ' సంతోషంగా అనబోయిన మాటలు ఆమె గొంతుదాటి బయటకు రాలేదు.

దగ్గిరకు రమ్మని కళ్ళతోనన్నా పిలవలేదు వరహాలు.

వాడి పట్టు వరహాలుకి తెలుసు।

చివరగా కొడుకుతో వొకేవొక్క మాట చెప్పాలని తెగ వుబలాటం పడ్డది। కాని గొంతు ఎంత ప్రయత్నించినా పెగల్లేదామెకి।

చెప్పాలనుకున్న మాటకి సంకేతంగా మాత్రం ఆమె కళ్ళు రావుడిమీంచి పసిడివాడి మీదకి, పసివాడి మీంచి రావుడి మీదకీ నాలుగయిదుసార్లు తిరిగాయి నిశ్శబ్దంగా. తల్లివంకే చూస్తూ నిలబడ్డ

రాలేవుడికి, తల్లి చెప్పకపోతున్న విషయం చూచాయగా అర్థమవుతోంది.

తను చెప్పవలసిన విషయం చెప్పేసి నట్టూ, తన జీవితపు ఆఖరి అంచుమీద నిలబడి కోరిన కోరికని తప్పకుండా తీర్చమన్నట్టూ, చూపు నిశ్చలంగా కొడుకుమీద నిలబెట్టి, తన రెండు చేతులు నెమ్మదిగా ఎత్తి జోడించిన వరహాలి చేతులూ, కళ్ళూ వొకేసారి వాలిపోయాయి.

"వరాలమ్మా" అంటూ బావురు మన్నాడు వంటాయన.

నిశ్చలంగా తల్లి శవంవంక చూస్తూ నిలబడ్డ రావుడు చూపు దింపి, కళ్లూ, పిడికిళ్లూ మూసుకు పడుకున్న పసిగుడ్డు వంక చూసాడు.

వాడి కళ్ళు తల్లిశవాన్నీ, పసిగుడ్డునీ మార్చి మార్చి చూడసాగాయి.

వొకటి, రెండు, మూడు నిముషాలు తదేకంగా చూశాడు.

వాడి బుర్రలో ఆలోచనలు తెగే వేళకి—

'కేర్'మని గుక్కపెట్టి ఏడవటం మొదలెట్టిన పసివాడిని—

చప్పున ఎత్తుకుని పరిగెత్తాడు.

వాడి పరుగు గోవిందరాజులింటి ముందాగి వొక్క క్షణం ఆలోచించి లోపలికి నడిచి—

ఆగమని అడ్డుకోబోయిన శంకరప్పని పులిపిల్లలా చూసి, నేరుగా వెళ్ళి గోవిందరాజుల గదితలుపులు అతి భయంకరంగా తట్టింది.

ఉలిక్కిపడి తెరుచుకున్న తలుపు లవతల నిల్చున్న గోవిందరాజుల్ని చూసి—

"వీడు నీ కొడుకని చెప్పుకునే ధైర్యం నీకు లేకపోయినా, నా తమ్ముడని చెప్పుకునే ధైర్యం నాకుంది. మా నాన్నని, అమ్మని చంపినందుకు నష్టపరిహారం ఇమ్మనడగటానికి రాలేదు నేను వీణ్ణి పెంచి పెద్దచెయ్యటానికి నీ ఆస్థిలో భాగం ఇమ్మనడానికి వొచ్చాను. నీ పరువు నష్ట పోకుండా వుండటానికి ఎంత పరిహారం చెల్లిస్తావో చెప్పు!"

సూటిగా అడిగాడు రావులు.

అలా అడిగింది చిన్నవాడయిన రావులు కాదని, ఆ వెనక సింహాద్రి, వరహాలు, సింహాచలంకాక, లెక్కపెట్ట లేనన్ని గొంతులున్నాయని—

గోవిందరాజులికి తెలిసింది ఆ క్షణం లోనే.

